
సాక్షి
పశ్చిమగోదావరి
సోమవారం । 3 । ఫిబ్రవరి । 2025



అదరగొట్టిన అమ్మాయిలు

బాస్కెట్‌బాల్ పోటీల్లో జిల్లా బాలికలు సత్తాచాటారు. రాష్ట్రస్థాయి అండర్-23 బాస్కెట్‌బాల్ పోటీల్లో తిరుగులేని ఆధిపత్యం కనబర్చారు. 8లో



మామిడికి మంచు దెబ్బ

మెట్ట ప్రాంతంలో మామిడి పంట మంచు దెబ్బకు విలవిలలాడుతోంది. పూత, పిందె మాడిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. 8లో



గ్రీన్‌ఫీల్డ్ మాటున..

అక్రమ గ్రావెల్ తవ్వకాలకు యర్రంపేట పంచాయతీలోని రెవెన్యూ ప్రాంతం అడ్డాగా మారింది. మెట్ట ప్రాంతంలో గ్రావెల్ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. 8లో

పేకాట తీరం

నరసాపురం పేరు చెప్పగానే సుదీర్ఘ తీర ప్రాంతం, పచ్చటి పొలాలు, లేసు ఉత్పత్తులు, భిన్న సంస్కృతులు, ప్రశాంత వాతావరణం గుర్తుకొస్తాయి.. ఇక్కడ జూదాలు, విష సంస్కృతులకు స్థానం లేదు.. ఇంతటి ప్రశాంత తీరంలో మూడు పూటలా.. మూడు ముక్కలాటకు కూటమి నేతలు సన్నాహాలు చేస్తున్నారు. నరసాపురం చరిత్రలో తొలిసారిగా విష సంస్కృతికి నాంది పలుకుతూ పేకాట క్లబ్ ఏర్పాటుచేశారు. ఏకంగా జాతీయ రహదారి పక్కనే పక్కా భవనాన్ని సిద్ధం చేయడం విమర్శలకు తావిస్తోంది.



నరసాపురం మండలం సీతారామపురంలో 216 జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన పేకాట క్లబ్

కూటమి బరి తెగింపు

- నరసాపురంలో హైవే పక్కన పేకాట క్లబ్
- పక్కా భవనం సిద్ధం చేసిన సిండికేట్
- ఉగాది నుంచి పెద్ద ఎత్తున నిర్వహణకు సన్నాహాలు
- ప్రతినెలా కూటమి నేతలకు ముట్టజెప్పేలా ఒప్పందాలు
- నరసాపురంలో తొలిసారిగా విష సంస్కృతి

నరసాపురం : జిల్లాలో పాలకొల్లు, భీమవరం, తాడేపల్లిగూడెం ప్రాంతాల్లో పేకాట క్లబ్‌లు నడిచినా నరసాపురంలో ఇప్పటివరకూ లేవు. సంక్రాంతి సమయంలోనూ గతంలో పెద్దగా కోడిపందేలు, జూదాలు ఉండేవి కాదు. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రాకతో ఈ ఏడాది కోడిపందేలు, జూదాలు బాగా పెరిగాయి. ఇప్పుడు మరో అడుగు ముందుకేసి నరసాపురం ప్రాంతంలో తొలిసారిగా పేకాట క్లబ్‌ను బహిరంగంగానే ఏర్పాటుచేశారు. నరసాపురం మండలంలోని సీతారామపురం గ్రామంలో 216 జాతీయ రహదారి పక్కన పక్కా భవనాన్ని సిద్ధం చేశారు. ఏ అనుమతులు లేకుండా నరసాపురం యూత్ క్లబ్ అండ్ కల్చరల్ అసోసియేషన్ పేరుతో బోర్డు కూడా తగిలించారు. ఈ విషయంలో ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ అపప్రద మూటకట్టుకుంటున్నా ఎందుకు నోరు మెదపడంలేదనే అంశంపై భిన్న కోణాల్లో చర్చ జరుగుతోంది.

సిండికేట్‌గా ఏర్పడి..

నరసాపురం మండలంలోని సీతారామపురం, రుస్తుంబాద, భీమవరం మండలంలోని వెంప గ్రామాలకు చెందిన కొందరు సిండికేట్‌గా ఏర్పడి క్లబ్ నిర్వహణకు పూనుకున్నారు. అడ్డంకులు రాకుండా కీలక కూటమి నేతలకు ప్రతినెలా భారీ మొత్తంలో ముట్టజెప్పేలా ఒప్పందాలు చేసుకున్నట్టు సమాచారం. నరసాపురం-మచిలీపట్నం జాతీయ రహదారిపై ఇటీవల ట్రాఫిక్ భారీగా పెరిగింది. ఇతర జిల్లాల నుంచి కూడా ఈ రూట్‌లో విజయవాడకు వెళ్లేవారి సంఖ్య పెరిగింది. అటు కృష్ణా జిల్లా నుంచి కూడా దూరం తగ్గింది. దీంతో ఉభయగోదావరి, కృష్ణా జిల్లాల వారికి అందుబాటులో ఉండేలా ఈ ప్రాంతంలో క్లబ్ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. పేరుపాలెం బీచ్ కూడా దగ్గరగా ఉండటం, పెద్ద సంఖ్యలో ఇటీవల రిసార్ట్స్ కూడా వినియోగంలోకి రావడంతో జూదంతో పాటు ఇతర అసాంఘిక కార్యక్రమాలకు కూడా అనువుగా ఉంటుందని, ఓ విధంగా ఈ ప్రాంతం సేఫ్‌జోన్‌గా ప్రచారంలో పెట్టించారు. తద్వారా చుట్టుపక్కల జిల్లాల్లోని జూదరులను భారీగా ఆకర్షించవచ్చని సిండికేట్ ఆలోచనగా చెబుతున్నారు.

పోలీసుల మౌనముద్ర

బహిరంగంగా పక్కా భవనంలో క్లబ్ ఏర్పాటు చేసినా నరసాపురం పోలీసులు మౌనముద్రలో ఉండటం గమనార్హం. ప్రభుత్వంలోని కూటమి పెద్దల ఒత్తిళ్లతో పాటు పోలీసులకు కూడా సంతృప్తికరంగా తాయిలాలు ఇప్పటికే అందాయనే ప్రచారం జరుగుతోంది. సంక్రాంతి సమయంలో ఓ రోజు లాంఛనంగా క్లబ్‌ను తెరవడంతో పోలీసులు దాడిచేసి కొందరిని అదుపులోకి తీసుకున్నా రు. అయితే ఇది ప్రారంభంలో హడావుడి చేయడానికి పోలీసులు చేసిన ప్రయత్నం మాత్రమే అనే విమర్శలు ఉన్నాయి. మొత్తంగా ఏ ఆటంకాలు లేకుండా రానున్న ఉగాది నుంచి క్లబ్‌లో నిరాటంకంగా పేకాటలు ఆడించడానికి రంగం సిద్ధం చేస్తున్నట్టు సమాచారం. మొత్తంగా ఈ నిర్వాకంపై నరసాపురం ప్రాంత ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు.

క్లాప్ ఆటోలను కొనసాగించాలి



డ్రైవర్ల సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమయ్య

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరపాలక సంస్థలో మూడేళ్లుగా క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్) పేరుతో ఇంటింటా చెత్త సేకరిస్తున్న 60 ఆటోలను ఈనెల 1వ తేదీ నుంచి కూటమి ప్రభుత్వం నిలిపివేసింది. దీంతో 60 మంది డ్రైవర్లు రోడ్డున పడ్డారు. క్లాప్ ఆటోలను కొనసాగించాలని, 60 మంది డ్రైవర్లను విధుల్లోకి తీసుకోవాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.సోమయ్య డిమాండ్ చేశారు. స్థానిక పవర్‌పేట కార్యాలయంలో ఆదివారం యూనియన్ అధ్యక్షుడు వి.రాజు అధ్యక్షతను సమావేశం నిర్వహించారు. ఇంటింటా చెత్త సేకరణ నిలిపివేయడం దారుణమని సోమయ్య అన్నారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు లావేటి కృష్ణారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.జాన్ బాబు మాట్లాడుతూ నోటీసులు ఇవ్వకుండా డ్రైవర్లను అక్రమంగా తొలగించడం అన్యాయమన్నారు. సమావేశంలో క్లాప్ ఆటో డ్రైవర్ల నాయకులు గణేష్, శ్రీను, కుమార్, 60 మంది డ్రైవర్లు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

పాములపర్రు కాలువకు గండి



గండి పూడుస్తున్న దృశ్యం

ఉండి : మండలంలోని పాములపర్రు పంట కాలువకు తెల్లికోడు మురుగు కాలువ వద్ద ఆదివారం గండి పడింది. సాగునీరు గండి ద్వారా మురుగు కాలువలోకి వెళ్లడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉండి డీసీ వైస్‌చైర్మన్ మంతెన సాయిలచ్చిరాజు ఆధ్వర్యంలో గండి పూడిక పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టారు. మట్టి బస్తాలతో గండిని పూడ్చారు. కాలువ గట్టు పటిష్టతకు చర్యలు చేపడతామని అధికారులు తెలిపారు. ఎంపీటీసీ యడవల్లి వెంకటేశ్వరరావు సర్పంచ్ కేశన శాంతకుమారి బలుసులరావు, నీటి సంఘ ఉపాధ్యక్షుడు గుత్తుల సత్యనారాయణ, ఇరిగేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వేడుకగా శోభనాచలుని కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న దృశ్యం

ఆగిరిపల్లి: ఆగిరిపల్లిలోని శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహ స్వామి మాఘమాస రథసప్తమి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం శాంతి కల్యాణాన్ని వేడుకగా నిర్వహించారు. ఉదయం రజక సంఘం ఆధ్వర్యంలో కల్యాణం జరిపించగా.. రాత్రి 8 గంటలకు వైశ్య సంఘం ఆధ్వర్యంలో గజ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం నేత్రపర్వమైంది. అర్చకులు వేదంతం శేషబాబు, అనంతకృష్ణ కల్యాణ తంతు జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

12 నుంచి రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు



పోటీల బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం: మూగ, చెముడు క్రీడాకారుల 5వ రాష్ట్రస్థాయి టీ-20 క్రికెట్ చాంపియన్‌షిప్ పోటీలు ఈనెల 12, 13 తేదీల్లో భీమవరంలో నిర్వహించనున్నారు. పోటీల బ్రోచర్‌ను రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు తన కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు చెరుకువాడ రంగసాయి, అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు భూపతిరాజు మురళీ కృష్ణంరాజు, సీహెచ్ తాతారావు మాట్లాడుతూ భీమవరం గన్నాబత్తుల క్రీడా మైదానంలో పోటీలు నిర్వహిస్తామని, 10 జట్లు పాల్గొంటాయన్నారు. పోటీలకు డీఎన్నార్ కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు గోకరాజు వెంకట నరసింహరాజు, గాదిరాజు సత్యనారాయణరాజు సంపూర్ణ సహకారం అందిస్తామని చెప్పారు.

పీజీఆర్ఎస్ రద్దు

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఈనెల 3 నుంచి వచ్చేనెల 8 వరకు ప్రతి సోమవారం జిల్లా, డివిజన్, మండల కార్యాలయాల్లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికను రద్దు చేస్తున్నట్టు కలెక్టర్ సీహెచ్ నాగరాణి తెలిపారు. ప్రజలు సమస్యలపై దరఖాస్తులను సమీపంలోని గ్రామ/వార్డు సచివాలయాల్లో నమోదు చేసుకోవచ్చని చెప్పారు. మరలా పీజీఆర్ఎస్ నిర్వహించే తేదీని ప్రకటన ద్వారా తెలియజేస్తామన్నారు.

డ్రైవర్ నియామకంపై అధికారుల దృష్టికి తీసుకెళ్లాం

సాక్షి స్పందన

తణుకు అర్బన్: 'కుంటుపడ్డ పశు వైద్యం' శీర్షికన 'సాక్షి'లో ఆదివారం ప్రచురితమైన కథనానికి రాష్ట్ర పశు ఆరోగ్య సంస్థ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎల్‌కే సుధాకర్ స్పందించారు. తణుకు మండలంలోని 1962 పశు వైద్య అంబులెన్స్ వాహనానికి డ్రైవర్ లేని కారణంగా తొమ్మిది నెలలుగా అందుబాటులో లేదని, ఆ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టిలో ఉంచామని చెప్పారు. అత్యవసర కేసులను అత్తిలిలో అందుబాటులో ఉన్న మరో వాహనం ద్వారా అందిస్తున్నామన్నారు. డ్రైవర్ నియామకం కోసం ఉన్నతాధికారులకు నివేదించామని ఆయన తెలిపారు.

'అమ్మా'నుషం.. పైశాచికానందం

- ప్రియుడితో కలిసి చిన్నారులను కొట్టి హింసించిన తల్లి
- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలలు
- విచారణకు కలెక్టర్ ఆదేశం



చిన్నారులను అధికారులతో కలిసి పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి జెట్టి గురునాథరావు

జంగారెడ్డిగూడెం: కన్న ప్రేమను కాదని.. ప్రియుడి మోజులో కడుపున పుట్టిన బిడ్డలను చిత్రహింసలకు గురిచేసింది.. చార్జింగ్ వైరుతో కొట్టి, గాయాలపై కారం పూసి చిన్నారులపై పైశాచిక దాడికి పాల్పడిన ఘటన జంగారెడ్డిగూడెంలో కలకలం రేపింది. స్థానికుల జోక్యంతో విషయం వెలుగుచూడగా, చిన్నారులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై కలెక్టర్ కె.వెట్రిసెల్వి వైద్యారోగ్యశాఖ అధికారులను విచారణకు ఆదేశించారు. వివరాలిలా ఉన్నాయి.. కామవరపుకోట మండలం తాడివర్లకు చెందిన గానాల శారద భర్తతో విడిపోయి పిల్లలు ఉదయ్ రాహుల్ (9), రేణుక (5)తో కలిసి జంగారెడ్డిగూడెం సీఎస్ఆర్ మాల్ సమీపంలో నివాసముంటోంది. నల్లవెలుగుల పవన్‌కుమార్ అనే వ్యక్తితో కలిసి ఆమె సహజీవనం చేస్తోంది. రోజూ పవన్‌కుమార్ మద్యం సేవించి వచ్చి చిన్నారులు ఉదయ్‌రాహుల్, రేణుకను సెల్‌ఫోన్ చార్జింగ్ వైరుతో చిత్రహింసలు పెడుతున్నాడు. తల్లి శారద అతడికి సహకరిస్తూ చిన్నారులను కొట్టేది. చిన్నారుల వంటిపై గాయాలకు కారం పూయడంతో పాటు నోట్లో కారం, పచ్చిమిర్చి కుక్కి హింసించేది. శనివారం అర్ధరాత్రి చిత్రహింసలు భరించలేక చిన్నారులు కేకలు వేసుకుంటూ బయటకు రాగా స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై షేక్ జబీర్ చిన్నారులను స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు.

తల్లి, ప్రియుడిని కఠినంగా శిక్షించాలి

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి జెట్టి గురునాథరావు పరామర్శించారు. దోషులను కఠినంగా శిక్షించాలని, తల్లిని, ప్రియుడిని అరెస్టు చేయడంతో పాటు చిన్నారుల బాధ్యతలను ప్రభుత్వం తీసుకోవాలని డిమాండ్ చేశారు. తాము కూడా సహాయ, సహకారాలు అందిస్తామన్నారు.

కేసు నమోదు

తల్లి శారద, ప్రియుడు పవన్‌కుమార్‌పై కేసు నమోదు చేసినట్టు డీఎస్పీ యు.రవిచంద్ర తెలిపారు. ఆస్పత్రిలో చిన్నారులను ఆయన పరామర్శించారు. సోషల్ మీడియా, ప్రసార మాధ్యమాల్లో చిన్నారుల ఫొటోలు, వారి ముఖాలు కనిపించకుండా చూడాలని, చిన్నారులను ఇబ్బందులకు గురిచేయవద్దని డీఎస్పీ కోరారు. సీఐ వి.కృష్ణబాబు ఉన్నారు.

ఎస్సై ఆత్మహత్యకు కారణం పశువధ శాలే..

మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: ఎస్సై ఏజీఎస్ మూర్తి ఆత్మహత్య ఘటనలో తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ నడిపిస్తున్న లాహం ఫుడ్ ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ పశువధ శాల కీలక పాత్ర పోషించిందని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. గతేడాది నవంబరులో వేల్పూరులో జరిగిన గేదెల చోరీకి సంబంధించి గేదెలను పశువధ శాలకు విక్రయించడం, వధింపబడిన కారణంగా పోలీసులు గేదెలను రికవరీ చేయలేని క్రమంలోనే డబ్బు లావాదేవీలు చేశారని చెప్పారు. తణుకు రూరల్ సర్కిల్ కార్యాలయంలో డబ్బు కట్టలతో చేసిన లావాదేవీల్లో ఎస్సై మూర్తి లేకపోయినా అధికారులు చేసిన కుట్రలో ఆయన బలిపశువుగా మారారని ఆవేదన వ్యక్తం చేశారు. గేదెలు రికవరీ అయితే డబ్బు లావాదేవీలకు ఆస్కారం ఉండేది కాదని, ఎస్సై వీఆర్‌కు వెళ్లాల్సిన అవసరం కూడా ఉండేది కాదని తెలిపారు. వీఆర్‌లో ఉన్న ఎస్సై తీవ్ర మనోవేదనతోనే ఆత్మహత్యకు ప్రేరేపించబడ్డారని చెప్పారు. పశువధ శాలకు అనుమతులు లేకపోయినా పోలీసులను కాపలాగా పెట్టి నడిపిస్తున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణనే దీనంతటికీ కారకుడని దుయ్యబట్టారు. ఎస్సైను ఇబ్బంది పెట్టినవారు ఎవరనేది ఆయన ఫోన్‌లోనే నిక్షిప్తమై ఉందని, పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించి ఫోన్‌లో ఉన్న సమాచారాన్ని బయటపెట్టాలని, రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా కేసును ప్రత్యేక సిట్‌తో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. ఎస్సై కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలుపుతున్నానని మాజీ మంత్రి కారుమూరి చెప్పారు. ఈ సందర్భంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు.

అరాచకాలకు అడ్డాగా తణుకు

ప్రశాంతతకు మారుపేరైన తణుకు నియోజకవర్గం కూటమి ప్రభుత్వంలో అరాచకాలకు అడ్డాగా మారిందని, రాష్ట్రవ్యాప్తంగా మాయని మచ్చలను ఎమ్మెల్యే అంటిస్తున్నారని మాజీ మంత్రి కారుమూరి ధ్వజమెత్తారు. పశువధ శాల ప్రాంతంలో ఉండలేకపోతున్నామని రోడ్డెక్కిన మహిళలను కిరాయి మూకలతో కొట్టించిన ఘనత ఆరిమిల్లికే దక్కుతుందని విమర్శించారు. గతంలో ఆరిమిల్లి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఒక ఎస్సైని కింద కూర్చోబెట్టి అవమానించారని, నేడు తన అరాచకాలు, అక్రమాలకు వ్యతిరేకంగా ఉన్న మరో ఎస్సైని ఇక్కడ నుంచి పంపించేందుకు సిద్ధంగా ఉన్నారని ఎద్దేవా చేశారు. పేకాట, కోడి పందేలు, అశ్లీల కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అనుయాయులను అధికారులు అడ్డుకుంటే.. వారిని కించపరిచేలా మాట్లాడుతున్నారని విమర్శించారు. అధికారులు ఒత్తిళ్లతో నలిగిపోతున్నారన్నారు. డబ్బే ప్రధానంగా రాజకీయం చేస్తూ ప్రజలను విస్మరిస్తున్నాడని ఎమ్మెల్యేపై విమర్శలు గుప్పించారు. కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కి ఒరిగిందేమీ లేదని, బిహార్ కోట్లాది రూపాయలు సాధించుకుందని, ఇక్కడి నేతలు ఏమీ తేలేకపోయారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ సభ్యుడు వెలగల సాయి బాబారెడ్డి, జిల్లా సెక్రటరీ ఆర్గనైజేషన్ ఇందుగపల్లి బలరామకృష్ణ పాల్గొన్నారు.

ఉత్సవాలు కళకళలాడేలా..

- వైభవంగా భీమవరం మావుళ్లమ్మ ఉత్సవాలు
- సంప్రదాయ కళారూపాలకు అగ్రపీఠం
- హరికథ, నృత్య, పౌరాణిక, జానపద ప్రదర్శనల ఏర్పాటు
- కళాకారులకు ప్రోత్సాహం
- వెయ్యి మందికి పైగా కళాకారులు, వేలలో సందర్శకుల రాక

సిరులతల్లి.. కల్పవల్లి.. భక్తులపాలిట కొంగు బంగారం భీమవరం మావుళ్లమ్మ ఉత్సవాలు కళలకు కాణాచిగా నిలుస్తున్నాయి. ఏటా నెలరోజులపాటు నిర్వహించే ఉత్సవాల్లో సంప్రదాయ కళారూపాలకు పెద్దపీట వేస్తున్నారు. పౌరాణిక, జానపద, హరికథ, నృత్య ప్రదర్శనలు ఏర్పాటుచేస్తూ కళాకారులను ప్రోత్సహిస్తున్నారు. సాధారణంగా గ్రామదేవతల ఉత్సవాలు రెండు మూడు రోజుల్లో ముగిసిపోతే.. అందుకు భిన్నంగా భీమవరంలో ఏటా భోగి పండుగ రోజున మొదలై ఫిబ్రవరి రెండో శుక్రవారం వరకు ఉత్సవాలు జరగడం ప్రత్యేకం.

సాక్షి, భీమవరం: నీరుల్లి కూరగాయలు, పండ్ల వర్తక సంఘం 60 ఏళ్లగా మావుళ్లమ్మ ఉత్సవాలు నిర్వహిస్తోంది. ఉత్సవాల వ్యయం తొలుత రూ.5 వేలతో మొదలై ఇప్పుడు రూ.కోటికి పైనే అవుతోంది. ఔరా అనిపించే విద్యుత్ సెట్టింగులు, రోజూ మధ్యాహ్నం మొదలై అర్ధరాత్రి వరకు సాగే కళా ప్రదర్శనలు, 30 వేల మంది నుంచి 50 వేల మంది భక్తుల రాకతో 61వ వార్షిక ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి.

ఉత్సవాల్లో సంప్రదాయ కళారూపాలకు పెద్దపీట వేస్తారు. భజనలు, పారాయణాలతో మొదలై కూచిపూడి/భరత నాట్యం, హరికథ/బుర్రకథ కాలక్షేపం, సంగీత విభావరి, అనంతరం సాంఘిక/పౌరాణిక నాటకాల ప్రదర్శనతో ఆ రోజు ముగుస్తుంది. ఉత్సవాల నిర్వహణపై ఏటా కమిటీ బుక్‌లెట్‌ను విడుదల చేస్తుంది. గతంలో తెల్లవారే వరకు ప్రదర్శనలు సాగితే కోవిడ్ అనంతరం మధ్యాహ్నం రెండు గంటల నుంచి అర్ధరాత్రి వరకు ఉంటున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వెయ్యి మందికి పైగా కళాకారులు, డోలక్, మృదంగం, హార్మోనియం, కిలారి నెట్ వాయిద్యకారులు, రైటర్లు, డైరెక్టర్లు, మేకప్‌మెన్లు అమ్మవారి సన్నిధిలో తమ కళారూపాలను ప్రదర్శిస్తారు.



ఆలయం వద్ద విద్యుత్ దీపాలంకరణ



సంప్రదాయ నృత్య భంగిమ



ప్రదర్శనలు తిలకిస్తున్న భక్తులు, కళాభిమానులు

ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి..

బాపట్ల జిల్లా చెరుకుపల్లి ఉషోదయ నాట్యమండలి, గుడివాడ జై నాట్యమండలి, కళారంజని ఆర్ట్స్ అసోసియేషన్, విజయదుర్గా నాట్యమండలి, గుంటూరు శ్రీశ్రీనివాస చైతన్య కళా నాట్యమండలి, సమతా నాటక మండలి, సంపత్ నగర్ శ్రీబాల సరస్వతి నాట్యమండలి, రాజమహేంద్రవరం ఉమాశ్రీవాణి కళాసారథి, మిలటరీ మాధవరం జగత్ విజేత నాట్యమండలి తదితర పేరొందిన ఎన్నో సంస్థల కళాకారులు ట్రూపు ప్రదర్శనలిస్తున్నారు. దేవీ మహత్యం, మాయాబజారు, శ్రీవల్లీ కల్యాణం, మోహినీ భస్మాసుర, పల్నాటి యుద్ధం, నాలుగు రత్నాలు తదితర పౌరాణిక, సాంఘిక, పద్య నాటకాలు, వెరైటీ బుర్రకథలతో కళాభిమానులను అలరిస్తున్నారు.

విద్యుత్ కాంతులతో శోభ

విద్యుత్ కాంతులు ఉత్సవాలకు మరింత శోభను తెస్తున్నాయి. ఆలయం ప్రాంగణం, ఆలయం ముందు, వెనుక భాగాల్లో మూడు డెకరేషన్ సంస్థలు పోటాపోటీగా భారీ సెట్టింగులతో ఆలయ ఆవరణను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశాయి.

ప్రత్యేక ఆకర్షణగా కాస్టింగ్ నాటకాలు



నాటక ప్రదర్శనలో కళాకారులు

20 రోజుల పాటు బయటి కళాపరిషత్‌ల నాటక ప్రదర్శనలు ఉంటే పది రోజుల పాటు ఉత్సవ కమిటీ ప్రత్యేకంగా సమర్పించే కాస్టింగ్ నాటకాలు ప్రత్యేక ఆకర్షణ. సత్యహరిశ్చంద్ర, శ్రీకృష్ణ తులాభారం, బాలనాగమ్మ, కురుక్షేత్రం, గయోపాఖ్యానం తదితర పౌరాణిక నాటకాల్లో ఒక్కో పాత్రకు ఉభయ రాష్ట్రాల్లో పేరొందిన నలుగురు ఐదుగురు కళాకారులను ఎంపిక చేసి వారితో ఆయా నాటకాలను ప్రదర్శిస్తుంటారు. ప్రముఖ నాటకాల్లోని ముఖ్య ఘట్టాలతో రంగస్థల ఆణిముత్యాలు, రెండు రత్నములు, మూడు రత్నాలు, పంచ రత్నాలు పేరిట ప్రత్యేక నాటకాలు ఉంటాయి. ట్రూపు ప్రదర్శనల కన్నా కాస్టింగ్‌కు నాలుగింతలు ఎక్కువే ఖర్చు చేస్తారు. వీటిని చూసేందుకు ఎందరో కళాభిమానులు వస్తుంటారు. లాభాపేక్షతో కాకుండా అమ్మవారిపై భక్తిభావంతో రావడం వల్ల భారీస్థాయిలో జరిగే ఉత్సవాలకు ఖర్చు తక్కువగానే ఉంటుందని కమిటీ సభ్యులు చెబుతున్నారు.

వందల మంది కళాకారులు



సత్యహరిశ్చంద్రలో చంద్రమతి, రామాంజనేయ యుద్ధంలో శాంతిమతి పాత్రలు చేస్తుంటాను. నేర్చుకున్న కళను అమ్మవారి సన్నిధిలో ప్రదర్శించడం చాలా ఆనందంగా అనిపిస్తుంది. రెండు రాష్ట్రాల నుంచి నెల రోజుల పాటు వందల మంది కళాకారులు వస్తుంటారు.

– నంద్యాల సత్యకుమారి, కళాకారిణి, ఖమ్మం

కళాకారులకు ప్రాధాన్యమిస్తూ..



శ్రీకృష్ణుని పాత్రతో నాటక రంగంలో నా అనుభవం ఐదున్నర దశాబ్దాలు అయితే నాలుగు దశాబ్దాలుగా మావుళ్లమ్మ ఉత్సవాల్లో ప్రదర్శనలిస్తున్నాం. ఉత్సవ కమిటీ కళారంగానికి ప్రాధాన్యమిస్తూ ప్రత్యేకంగా కాస్టింగ్ నాటకాలను ప్రదర్శించడం అభినందనీయం.

– కందుల గునేశ్వరరావు, కళాకారుడు, విజయనగరం

క్లుప్తంగా

ఆగని కోడిపందేలు



ఈస్ట్ యడవల్లిలో కోడిపందేలు నిర్వహిస్తున్న దృశ్యం

కామవరపుకోట: మండలంలో టీడీపీ నాయకులు అండదండలతో యథేచ్ఛగా కోడిపందేలు సాగుతున్నాయి. ఆదివారం మండలంలో ఈస్ట్ యడవెల్లి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అనుకుని, కోడి పందేలు నిర్వహించడంపై గ్రామస్తులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. కోడిపందేలు నిర్వహిస్తుండగా ఒక విలేకరి ప్రశ్నించేందుకు వెళ్లగా అతనిపై నిర్వాహకులు దాడికి ప్రయత్నించారు. సదరు వ్యక్తి తడికలపూడి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది, తడికలపూడి పోలీసులను వివరణ కోరగా ఫిర్యాదు అందినట్లు వారు తెలిపారు.

వృద్ధురాలి మెడలో గొలుసు అపహరణ

పాలకోడేరు: వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు తెంపుకుపోయిన ఘటన మండలంలోని శృంగవృక్షంలో జరిగింది. కూర్మాల నాగేశ్వరి(80) మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో తన ఫ్యాన్సీ షాపులో ఉండగా.. చెప్పులు కావాలని గుర్తు తెలియని వ్యక్తి వచ్చాడు. లోపలకు వెళ్లేందుకు నాగేశ్వరి వెనక్కి తిరగగా.. అగంతకుడు ఒక చేతితో ఆమె నోరు మూసి, రెండో చేతితో మెడలోని బంగారు గొలుసు లాక్కుని బైక్‌పై పారిపోయాడు. భీమవరం రూరల్ సీఐ బి.శ్రీనివాసరావు సంఘటనా ప్రదేశాన్ని తనిఖీ చేశారు. పోయిన గొలుసు విలువ దాదాపు రూ.2 లక్షలు ఉంటుందని అంచనా. బాధితురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయ పరిసరాల్లో గుండెపోటుతో వ్యక్తి మృతి

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయ ఆవరణలో ఆదివారం చిన్నారులకు చెవిపోగులు కుట్టిన అనంతరం ఒక వ్యక్తి గుండెపోటుకు గురై కుప్పకూలిపోయాడు. దేవస్థానం అంబులెన్స్‌లో స్థానిక పీహెచ్‌సీకి తరలించగా అప్పటికే అతడు మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. చినవెంకన్న వెంకన్న ఆలయంలో శివ అనే వ్యక్తి చెవిపోగులు కుడుతుంటాడు. గుడివాడకు చెందిన అతని మావయ్య ఎం.శ్రీనివాసరావు(65) కొద్ది రోజులుగా శివ వద్దే ఉంటున్నాడు. ఈ క్రమంలో శ్రీనివాసరావు ఆదివారం మధ్యాహ్నం తన అల్లుడు శివ వద్దకు వెళ్లి, భోజనానికి ఇంటికి పంపించాడు. ఆ తరువాత చిన్నారులకు అతడే చెవిపోగులు కుట్టాడు. విషయాన్ని ఫోన్ చేసి తన అల్లుడికి చెబుతుండగా అకస్మాత్తుగా గుండెపోటుకు గురై, కుప్పకూలి పడిపోయాడు. స్థానికులు పీహెచ్‌సీకి తరలించారు. అప్పటికే అతడు మృతి చెందాడు.

ఆర్థిక సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య

పెంటపాడు: ఆర్థిక సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఉదంతం పెంటపాడు మండలం పడమర విప్పర్రులో ఆదివారం జరిగింది. పెంటపాడు ఎస్సై స్వామి వివరాల ప్రకారం విప్పర్రు గ్రామానికి చెందిన చందనాల వెంకటేశ్వరరావు(50) గ్రామంలో వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నాడు. అతనికి భార్య ఉమాదేవితో పాటు, ఇద్దరు కుమార్తెలున్నారు. వారికి ఇటీవల వివాహాలయ్యాయి. చిన్న కుమార్తె ఇటీవల అనారోగ్య సమస్యతో మృతి చెందింది. గత కొంతకాలంగా అప్పులు ఎక్కువ కావడంతో అతను ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఉదయం పొలంలోని గేదెల పాక వద్ద దూలానికి తాడుతో ఉరివేసుకొని మృతిచెందాడు. స్థానికులు గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై స్వామి తెలిపారు.

అదరగొట్టిన అమ్మాయిలు

- బాస్కెట్‌బాల్‌లో జిల్లా బాలికల జయకేతనం
- అండర్-23 టోర్నీ కైవసం
- రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్న వైనం



విజయవాడలో అండర్-23 బాస్కెట్‌బాల్ చాంపియన్ షిప్ సాధించిన బాలికల జట్టు

ఏలూరు రూరల్: బాస్కెట్‌బాల్ పోటీల్లో జిల్లా బాలికలు తమకు తిరుగులేదనిపించారు. రెండ్రోజుల క్రితం విజయవాడలో ముగిసిన రాష్ట్ర స్థాయి అండర్–23 బాస్కెట్‌బాల్ పోటీల్లో మిగతా జట్లను భారీ స్కోర్ల తేడాతో ఓడించి సత్తా చాటారు. పటిష్టమైన అనంతపురం, విశాఖపట్టణం, గుంటూరు జట్లను ఓడించి బాలికలు అద్భుతమైన విజయం సాధించారు. ఈ విజయంతో ఎంతో మందిలో స్ఫూర్తి నింపారు. కొన్నేళ్ళుగా స్కూల్, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో ఈ జట్టు వరుస విజయాలు సాధిస్తోంది. ఎక్కువ శాతం బాలికలు ఏలూరు కస్తూర్బా బాలికల పాఠశాలలో ప్రాథమికోన్నత విద్య అభ్యసించిన వారే.. వీరి విజయాలను మెచ్చి దాతలు సైతం క్రీడా దుస్తులు, షూతో పాటు బహుమతులు అందించి ప్రోత్సహిస్తున్నారు.

నిరంతర సాధనతో సాధ్యం

పదవీ విరమణ చేసి ఉపాధ్యాయుల ఆర్థిక సాయంతో పాఠశాల పీడీ కె.మురళీకృష్ణ 2018లో పాఠశాలలో బాస్కెట్‌బాల్ కోర్టు నిర్మించడంతో బాస్కెట్‌బాల్ విజయాలకు పునాది పడింది. ఏటా వేసవి శిబిరం నిర్వహణతో పాటు క్రమం తప్పకుండా సాధన చేసేవారు. దీంతో పిల్లల్లో బాస్కెట్‌బాల్ పట్ల మక్కువ పెరిగింది. జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించిన సీనియర్ క్రీడాకారిణులు వి.చంద్రలేఖ, బి.లీలావతి, బి.భవానిదేవి, ఎల్.లీలాసరోజతో పాటు ఏ రుత్విక, జీ పూజిత, పి.నందిని తదితరులు సైతం రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నారు. నూజివీడులో జరిగిన అండర్–14 ఎస్‌జీఎఫ్ పోటీల్లో పాల్గొన్న జిల్లా జట్టులో వీరు సభ్యులుగా ఉన్నారు.

సాధించిన విజయాలు

రెండేళ్ల క్రితం విజయవాడ సిద్ధార్థ కళాశాలలో అండర్–17 ఏపీ అంతర జిల్లాల పోటీల్లో పాఠశాల క్రీడాకారిణులు పి.జయశ్రీ, ఆర్.రేణుక రాష్ట్ర జట్టుకు ఎంపికై జాతీయ పోటీల్లో పాల్గొన్నారు. 2020లో నూజివీడు కళాప్రపూర్ణ శ్రీరాజా బహదూర్ 44వ మెమోరియల్ బాస్కెట్‌బాల్ టోర్నమెంట్ చాంపియన్‌గా జట్టును నిలిపారు. 2018 రాష్ట్ర స్థాయి పోటీల్లో చాంపియన్‌షిప్ సాధించిన జిల్లా జట్టులో వీరి ప్రాతినిధ్యం ఉంది.

నిరంతర సాధనతోనే విజయం



ఇలాంటి విజయాలు ఎంతో స్ఫూర్తి, ఉత్సాహం ఇస్తాయి. మొట్టమొదట నిర్వహించిన అండర్–23 టోర్నీ గెలవడం చాలా గొప్పగా ఉంది. క్రమం తప్పకుండా సాధన చేయడం వల్లే అండర్–23 బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ సాధించాం. రోజూ ఉదయం, సాయంత్రం సాధన చేస్తాం. జాతీయ పోటీల్లో పాల్గొన్న అనుభవం ఉపయోగపడింది.

జి.నాగదేవి

పక్కా డిఫెన్స్‌తో ఆడాం



కోచ్ మురళీకృష్ణ సలహాలతో ప్రత్యర్థి జట్ల ప్లేయర్లను ఎలా అడ్డుకోవాలో ప్లాన్ వేసుకున్నాం. టోర్నీ మొత్తం పక్కా డిఫెన్స్‌తో ఆడాం. దీనివల్ల అనంతపురం, గుంటూరు, విశాఖపట్టణం లాంటి పెద్ద జట్లను సైతం అడ్డుకున్నాం. దీని కారణంగా టోర్నీలో వరుస విజయాలు సాధించాం. ఫైనల్‌లో సైతం పక్కా ప్లాన్‌లో ఆడి విజయం సాదించాం.

పి.వినయశ్రీ, ఏలూరు

టీం సమన్వయంతో విజయం



ఈ విజయం నాలో ఎంతో ధైర్యాన్ని నింపింది. రాబోయే రోజుల్లో మరిన్ని విజయాలు సాధిస్తాం. పెద్ద టోర్నమెంట్‌లో విజయం సాధించాలంటే టీం కో ఆర్డినేషన్ చాలా ముఖ్యం. మేం అందరం ఒక జట్టులా ఆడాం. మమ్మల్ని ఓడించేందుకు ప్రత్యర్థి జట్లు చాలా ప్రయత్నించాయి. అయినప్పటికీ వాళ్ల విజయం సాధించలేకపోయారు.

బి.లీలావతి, ఏలూరు

నిరంతర సాధన ముఖ్యం



టోర్నమెంట్‌లో మేం మొత్తం 7 మ్యాచ్‌లు ఆడాం. ఏడింటిలో విజయం సాధించాం. వరుసగా గెలవాలంటే నిరంతర ప్రాక్టీసు ఎంతో ముఖ్యం. ప్రాక్టీసు లేకుండా విజయాలు సాధించలేం. మేం టోర్నీకి ముందురోజు సైతం ఎంతో సాధన చేశా. ఏ మ్యాచ్‌లో ఎలా ఆడాలో మా కోచ్ మురళీకృష్ణ ఎంతో విలువైన సూచనలు, సలహాలు ఇచ్చారు.

టి.జ్యోతి, ఏలూరు

అద్భుత ప్రతిభ చాటారు



బాస్కెట్‌బాల్ పోటీల్లో జిల్లా బాలికలు అద్భుత విజయాలు సాధిస్తున్నారు. గతంలో ఎన్నడూ సాధించని విజయాల పట్ల ఎంతో సంతోషంగా ఉంది. నిరంతరం సాధన, పలు పోటీల్లో సాధించిన అనుభవం కారణంగా బాలికలు విజేతలుగా నిలిచారు. వీరి విజయాలతో మరింతమంది బాలికలు బాస్కెట్‌బాల్‌పై మక్కువ పెంచుకుంటున్నారు.

కె.మురళీకృష్ణ, వ్యాయామ ఉపాధ్యాయుడు, ఏలూరు

● కుండలు పోయి సీసాలు వచ్చె



వేసవికాలం వస్తుందంటే ఏజెన్సీ ప్రాంతంలోని తాటిచెట్ల నుంచి గిరిజనులు కల్లు గత ప్రారంభిస్తారు. కల్లు తీయడానికి చెట్లకు కుండలు కడతారు. వీటిని లొట్టులుగా పిలుస్తారు. మారుతున్న కాలంతోపాటు కల్లు కుండలకు కూడా కాలం చెల్లినట్టు కనిపిస్తుంది. కుండల స్థానంలో సీసాలను తాటిచెట్లకు కట్టి తీస్తున్నారు. తాటి చెట్టు నుంచి తక్కువ కల్లు వచ్చే సమయంలో సీసాలు కడతామని గిరిజనులు చెబుతున్నారు.

–బుట్టాయగూడెం

యువకుడిపై పోక్సో కేసు నమోదు

ఉంగుటూరు: బొమ్మిడి గ్రామానికి చెందిన తాటిపాక పుష్పరాజు(వరహబాబు)పై ఆదివారం పోక్సో కేసు నమోదైంది. చేబ్రోలు పోలీసుల వివరాల ప్రకారం బొమ్మిడి గ్రామానికి చెందిన బాలిక వేలివెన్నులో ఇంటర్మీడియట్ చదువుతోంది. యువతి ఇంటికి వచ్చినపుడల్లా వెంటాడి ప్రేమించమని వేధించేవాడు. విషయం తల్లిదండ్రులకు బాలిక చెప్పడంతో వారు చేబ్రోలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. కేసు నమోదుచేసిన చేబ్రోలు ఎస్సై సూర్యభగవాన్ దర్యాప్తు చేస్తున్నారు.

నా జీవితాన్ని సర్వనాశనం చేసింది వాళ్లే

- నా తప్పేమీ లేకున్నా.. నన్ను బలిచేశారు
- విజ్జి, పిల్లలు ఏమైపోతారో.. అంతా అయిపోయింది
- ఆత్మహత్యకు ముందు స్నేహితుడితో ఎస్సై మూర్తి తీవ్ర ఆవేదన
- సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఆడియో రికార్డింగ్

సాక్షి, భీమవరం/తణుకు అర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఎస్సై ఏజీఎస్ మూర్తి ఆత్మహత్యపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాజకీయ నాయకులు, పై అధికారుల వేధింపులే కారణమన్న అనుమానాలకు బలం చేకూరుస్తూ నెట్‌లో ఆడియో వైరల్ అవుతోంది. తనకు జరిగిన అన్యాయం, తన భార్య, పిల్లలు ఏమైపోతారోనని ఆయన పడిన ఆవేదన అందరిని కలచివేస్తోంది. తణుకు రూరల్ ఎస్సైగా పనిచేసిన సమయంలో గేదెల చోరీకి సంబంధించిన కేసు మాఫీకి ఆర్థిక లావాదేవీలు జరిగినట్టు వచ్చిన ఆరోపణల్లో తన ప్రమేయం లేకపోయినా తనను బలిపశువును చేశారని అప్పటి నుంచి మూర్తి తీవ్రంగా కుమిలిపోతున్నట్లు పోలీసు వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఆయన ఆత్మహత్య చేసుకోవడానికి రెండు మూడు రోజుల ముందు ఎస్సై మూర్తి తన స్నేహితుడితో మాట్లాడినట్లు ఆడియో వైరల్ అవుతోంది. పై అధికారులు తనను ఏ విధంగా బలిపశువును చేశారనే విషయమై స్నేహితుడి వద్ద వాపోయినట్లు తెలుస్తోంది. ఆడియో సంభాషణల్లో కొంత భాగం..

ఎస్సై: ఇంట్రెస్ట్ లేదురా..

ఫ్రెండ్: ఏంటి జాబా?

ఎస్సై: లేదురా లైఫ్ ఇంట్రెస్ట్ లేదురా. నన్ను మోసం చేసిన వాళ్లు హ్యాపీగా ఉన్నారు.

ఎస్సై: ఆ కృష్ణకుమార్, ఆ నాగేశ్వరరావు చేసిన పనికి నిజంగా ఈ రోజు నేను ఏదో అలా గెంటుతున్నాను. సరే వీఆర్ భీమవరం కదా చూద్దాం చూద్దాం అని.. చెప్పాను ఆ కృష్ణకుమార్‌కు నన్ను ఇబ్బంది పెట్టకండి సార్! అని. లేదు లేదు ఎమ్మెల్యే గారు చెప్పారు కదా అదీ ఇదీ అని పెంట చేశాడు నా జీవితాన్ని. సీఐ నాగేశ్వరరావుకు చెప్తే ఇలా పెంట చేశాడు. ఇద్దరు కలిసి సర్వనాశనం చేశారు నా జీవితాన్ని.. ఎంతో హ్యాపీగా చక్కగా చేసుకుంటూ ఫ్యామిలీతో ఉండొచ్చు కదా అనుకున్నాను.



ఏజీఎస్ మూర్తి, ఎస్సై(ఫైల్)

ఫ్రెండ్: పోస్ట్ ఇప్పటి దాకా ఉన్నావ్.. నాకు లూప్ కావాలి ట్రాన్స్‌ఫర్‌పై వెళ్లిపోతానని అడుగు ఒకసారి

ఎస్సై: అంతా ఊహించిందే జరుగుతుంది.

ఎస్సై: పిల్లలు, విజ్జిని చూస్తుంటే బాధేస్తుంది రా..

ఫ్రెండ్: ఏం మాట్లాడుతున్నావ్ రా ఊరుకో..

ఎస్సై: లేదురా పిల్లలు, విజ్జి గురించి ఆలోచిస్తుంటే చాలా చాలా బాధేస్తుంది రా.

ఫ్రెండ్: అసలేమైనా బుర్రా ఉందా! నీకు

ఎస్సై: మనం చాలా హ్యాపీగా ఉంటామనకున్నాం.

ఫ్రెండ్: రేయ్ ఏమైంది రా! ఇప్పుడు ఏం కొంపలు మునిగాయని తెలుసుకోకుండా.. పాజిటివ్ నెగిటివో తెలుసుకోకుండా.

ఎస్సై: అక్కడికి వెళ్తే కృష్ణా జిల్లా ఎలాట్‌మెంట్ అనేది తెలుసు నాకు. నేను అస్సలు ఉండలేను. ఒక్కరోజు కూడా నేను అక్కడ ఉండలేను. అక్కడ వాతావరణం అది నా వల్ల అయితే కాదు.

ఫ్రెండ్: రేయ్ బాబు నువ్ కంగారు పడకు.. పిచ్చి పిచ్చిగా మాట్లాడకు!

● రోల్స్ రాయిసా.. రీ మోడలా!



బ్రిటీష్ కాలం నాటి రోల్స్ రాయిస్ మోడల్ కారు ద్వారకాతిరుమలలో చూపరులను ఆకట్టుకుంది. స్థానిక ఎస్వీఎస్ ఫంక్షన్ హాల్లో ఆదివారం రాత్రి జరిగిన వివాహ వేడుకకు వధువరులను ఈ కారులో ఊరేగింపుగా తీసుకొచ్చారు. రూ.కోట్లాది రూపాయలు విలువైన బ్రిటీష్ కాలంనాటి ఈ రోల్స్ రాయిస్ మోడల్ కారు భలే.. ఉందంటూ పలువురు ఆశ్చర్యంగా తిలకించారు. రోల్స్ రాయిస్ మోడల్, లోగో ఉన్న ఈ కారు, రోల్స్ రాయిస్ ఇమిటేషన్ అయి ఉంటుందని, ఈవెంట్ వారు ఏర్పాటు చేసుంటారని పలువురు ట్రోల్స్ చేశారు.

–ద్వారకాతిరుమల

చికిత్స పొందుతూ మృతి

ద్వారకాతిరుమల: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. గొల్లగూడెంకు చెందిన పంపన వెంకటస్వామి(55) శనివారం పశువులకు మేత వేసిన అనంతరం బైక్‌పై ఇంటికి వెళ్తున్నాడు. రోడ్డు దాటుతుండగా బైక్ వేగంగా ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడ్డ వెంకటస్వామిని విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

గుబ్బల మంగమ్మ గుడికి పోటెత్తిన భక్తులు



గుబ్బల మంగమ్మ గుడికి పోటెత్తిన భక్తులు

బుట్టాయగూడెం: కామవరం సమీపంలోని అటవీ ప్రాంతంలో కొలువై ఉన్న గుబ్బల మంగమ్మ గుడికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాతో పాటు విజయవాడ, మచిలీపట్నం, తెలంగాణ రాష్ట్రంలోని భద్రాచలం, పాల్వంచ, కొత్తగూడెం, సత్తుపల్లి, అశ్వారావుపేట ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చి అమ్మవారికి నైవేద్యాలతో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.



నైవేద్యాలు తీసుకెళ్తున్న దృశ్యం

గ్రీన్‌ఫీల్డ్ మాటున అక్రమ దందా

కొయ్యలగూడెం: అక్రమ గ్రావెల్ తవ్వకాలకు యర్రంపేట పంచాయతీ పరిధిలోని రెవెన్యూ ప్రాంతం అడ్డాగా మారింది. యర్రంపేట పుంత రోడ్డు నుంచి నల్లజర్ల మండలం సుభద్ర పాలెంకు వెళ్లే మెట్ట ప్రాంతంలో గ్రావెల్ తవ్వకాలు కొనసాగుతున్నాయి. గ్రీన్‌ఫీల్డ్ హైవే నిమిత్తం సుభద్ర పాలెం పరిధిలోని రెవెన్యూ ప్రాంతంలో గ్రావెల్ తవ్వకాలు కొనసాగిస్తుండగా ఇదే అదునుగా రెడ్ బుక్ బ్యాచ్ గ్రావెల్ అక్రమ రవాణాకు తెరలేపింది. దీంతో సందట్లో సడేమియాగా గ్రీన్ ఫీల్డ్ హైవే మాటున రెడ్ బుక్ బ్యాచ్ రేయింబవళ్లు గ్రావెల్ రవాణా కొనసాగిస్తుంది. గ్రావెల్ అక్రమ రవాణాకు సంబంధించి సమాచారం ఇస్తున్నప్పటికీ ఫలితం లేకుండా పోతుందని రైతులు ఆరోపిస్తున్నారు. ఫిర్యాదు చేసిన కొద్దిసేపటికి అక్రమార్కులకు విషయం తెలిసి సర్దుకుంటున్నారని దీంతో అధికారులు వెళ్లేసరికి అక్రమ రవాణాకు సంబంధించిన సాక్ష్యాలు లేకుండా పోతున్నాయంటున్నారు. రెడ్ బుక్కు బ్యాచ్ గ్రావెల్ అక్రమ రవాణాకు అధికారులు సైతం సహకరిస్తున్నారనే సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. అడ్డుకట్ట వేయాల్సిన వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులు ఎమ్మెల్సీ ఎన్నికల విధులలో నిమగ్నమై ఉండటం, లేదా వీవీఐపీల పర్యటనలో ఉండడం అక్రమార్కులకు కలిసి వస్తున్నట్లు ఉంది.



యర్రంపేట సమీపంలో గ్రావెల్ తవ్వకాలు



అక్రమంగా గ్రావెల్ రవాణా

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి



రైలు పట్టాలపై మృతి చెందిన యువకుడు

భీమడోలు: భీమడోలు ఫ్లై ఓవర్ వంతెన సమీపంలో రైలు పట్టాలపై ఓ యువకుడి మృతదేహాన్ని ఆదివారం రైల్వే పోలీసులు గుర్తించారు. గుర్తుతెలియని రైలు బండి నుంచి జారిపడి తలకు బలమైన గాయాలై మృతి చెందినట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుడి వయస్సు 25 నుంచి 30 ఏళ్ల లోపు ఉంటుందని.. ఎత్తు సుమారు 5.6 అడుగులు, నల్లని జుట్టు, తెలుపు రంగు పొట్టి చేతుల టీషర్ట్, నలుపు, నీలం రంగు షార్ట్‌తో ఉన్నాడు. మృతదేహాన్ని ఏలూరులోని జీజీహెచ్‌లో పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు ఎస్సై పి.సైమన్ పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మృతుడి వివరాలు తెలిస్తే 9989219559 నెంబర్‌కు ఫోన్ చేయాలని చెప్పారు.

ఎస్ఆర్‌కేఆర్‌కు సిస్కో నెట్‌వర్కింగ్ అవార్డు



సిస్కో నెట్‌వర్కింగ్ అవార్డుతో ఎస్ఆర్‌కేఆర్ కళాశాల యాజమాన్యం

భీమవరం: భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలకు జాతీయస్థాయి సిస్కో నెట్‌వర్కింగ్ అవార్డు లభించిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కేవీ మురళీ కృష్ణంరాజు చెప్పారు. ఈ సందర్భంగా సిస్కో నుంచి వచ్చిన అవార్డును కళాశాల సెక్రటరీ సాగి రామకృష్ణ నిషాంత వర్మకు అందించారు. సిస్కో ఏటా దేశంలో అత్యుత్తమ కళాశాలలను గుర్తించి అవార్డులు ప్రదానం చేస్తుందని కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతి రాజు చెప్పారు.

మామిడికి మంచు దెబ్బ

దిగుబడిపై ఆందోళన చెందుతున్న రైతులు

చింతలపూడి: ప్రకృతి సహకరించకపోవడంతో ఈ ఏడాది మామిడి రైతులు తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నారు. మెట్ట ప్రాంతంలో మామిడి పంట మంచు దెబ్బకు విలవిల్లాడుతూంది. గత రెండేళ్లుగా ధర ఆశాజనకంగా ఉండటంతో రైతులు మామిడి పంటపై గంపెడాశతో ఉన్నారు. సంవత్సరమంతా సస్యరక్షణ చేపట్టి పంటను కాపాడుకుంటుంటే.. మంచు కారణంగా పూత, పిందె మాడిపోయి నష్టం వాటిల్లే ప్రమాదం ఏర్పడిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పుడు రాష్ట్రంలో ద్వితీయ స్థానం, జిల్లాలో ప్రథమ స్థానం ఆక్రమించి విదేశాలకు సైతం ఎగుమతి చేసిన మామిడి పంటకు మెట్ట ప్రాంతంలో గడ్డు కాలం ఏర్పడింది. ప్రకృతి వైపరీత్యాల కారణంగా మామిడి తోటలను రైతులు గత్యంతరం లేక తొలగిస్తున్నారు. గతంలో నియోజకవర్గంలో 50 వేల ఎకరాల్లో విస్తరించి ఉన్న మామిడి తోటలు క్రమంగా 7 వేల ఎకరాలకు తగ్గిపోయాయి. ఏటా ఇక్కడి నుంచి ఢిల్లీ, ముంబయ్, కోల్‌కతా, నాగపూర్, పూనా, అహ్మదాబాద్, తమిళనాడు, కేరళ వంటి ప్రాంతాలకు మామిడి కాయలు ఎగుమతి అవుతాయి. రాష్ట్రంలో విజయవాడ, హైదరాబాద్, రాజమండ్రి, గుంటూరు, తెనాలి వంటి వ్యాపార కేంద్రాలకు ఎగుమతి చేస్తారు. మామిడి సీజన్‌లో వేలాది మంది కూలీలకు ఇక్కడ పనులుండేవి. ఎగుమతి చేయడానికి, బుట్ట ప్యాకింగ్‌కు కూలీలు ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చేవారు. దిగుబడిపై ఉన్న అనుమానాలతో వ్యాపారులు ముందుకు రాక పోవడంతో కూలీలకు పనులు లేకుండా పోయాయి.



పూత మీద ఉన్న మామిడి తోట



మంచుతో పసుపు రంగులోకి మారుతున్న పూత

మంచుకు మాడుతున్న పూత



మంచు కారణంగా మామిడిపూత మాడిపోతోంది. నెల రోజులుగా విపరీతంగా కురుస్తున్న మంచుకు దిగుబడి తగ్గిపోయే ప్రమాదం ఉంది. మామిడి కాయల ఎగుమతికి ఇక్కడ సరైన సౌకర్యాలు లేవు. సస్య రక్షణకు ఎరువులు, పురుగు మందులకు వేలాది రూపాయలు ఖర్చు చేస్తున్నాం. ఫలితం లేకపోవడంతో తోటలను నరికి వేశాం .ప్రభుత్వం మామిడి రైతులను ఆదుకోవాలి

చేపూరి ఖాదర్ బాబు– రైతు, శెట్టివారిగూడెం

ట్రాఫిక్ సమస్యతో సతమతం

- కేఎన్ రోడ్డులో భారీగా ట్రాఫిక్
- పార్కింగ్ ప్లేస్‌లు లేకపోవడమే అసలు సమస్య



కేఎన్ రోడ్డులో రోడ్డుపైనే పార్కింగ్ చేసిన వాహనాలు



కేఎన్ రోడ్డులో ఓ షాపు వద్ద వాహనదారులు

తాడేపల్లిగూడెం (టీటీసీ): అనునిత్యం రద్దీగా ఉండే తాడేపల్లిగూడెం కేఎన్ రోడ్డులో సరైన పార్కింగ్ లేక పోవడంతో రహదారి కుచించుకుపోతుంది. వాహనాలు ముందుకు కదలడం లేదు. దీంతో ఈ మార్గంలో ప్రతి రోజూ రద్దీ పెరిగిపోతుంది. ట్రాఫిక్ కారణంగా ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. ఈ క్రమంలో తరుచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. కేఎన్ రోడ్డు పట్టణంలో తాళ్లముదునూరు పాడు శివారు నుంచి ప్రారంభమై హౌసింగ్‌బోర్డు శివారు వరకు ఉంటుంది. ఈ రహదారి పొడవునా షాంపింగ్ కాంప్లెక్స్‌లు, మాల్‌లు, ఇతర పెద్ద పెద్ద కాంప్లెక్స్‌లు, వ్యాపార కూడళ్లతో పాటు రహదారి మార్జిన్‌లో తోపుడు బండ్లవారితో రహదారులు ఇరుకుగా మారుతున్నాయి.

సెట్ బ్యాక్‌లు ఆక్రమణ

గతంలో ఈ రోడ్డులో భవనాల వాళ్లు సెట్‌బ్యాంక్ వదిలారు. అయితే వ్యాపారస్తులు తమ వ్యాపారాలను పెంచుకునేందుకు, షాపులు కనిపించేందుకు వీలుగా గతంలో ఉన్న సెట్ బ్యాక్‌లలో తిరిగి కొందరు వ్యాపారస్తులు తాత్కాలిక నిర్మాణాలు, కొందరు పర్మినెంట్ నిర్మాణాలు చేపట్టడంతో షాపులు రోడ్డుపైకి వచ్చేశాయి. దీంతో ఈ మార్గంలో రద్దీ బాగా పెరిగిపోయింది. వాహనాలు పార్కింగ్ స్థలం లేకుండా పోయింది. రోడ్లపైనే వాహనాలు నిలిపివేస్తున్నారు. షాపులు వద్దకు వచ్చే వారు పార్కింగ్‌కు ప్లేస్ లేకపోవడంతో చేసేది లేక రహదారులపైనే ద్విచక్ర వాహనాలు, కారులు నిలిపివేస్తున్నారు. ఆర్టీసీ బస్సులు, ఇతర పెద్ద పెద్ద వాహనాలు వెళ్లే సమయంలో రోడ్లపైనే కారులు, ద్విచక్ర వాహనాలు నిలిపి ఉంచడంతో బస్సులు, ఇతర వాహనాలు ముందుకు సాగేందుకు వీలు లేకపోవడంతో ట్రాఫిక్ సమస్య మరింత జఠిలమవుతుంది.

కూడళ్ల వద్ద మరీ రద్దీ:

టౌన్‌లో కేఎన్ రోడ్డు నుంచి అంతర్గత రహదారులలోకి వెళ్లేందుకు వీలుగా హౌసింగ్‌బోర్డు జంక్షన్, గొల్లగూడెంసెంటర్ జంక్షన్, రిలయన్స్ సెంటర్ వద్ద, బస్సు కాంప్లెక్స్ అవుట్‌గేట్, ఇన్‌గేట్ జంక్షన్‌లు, జీవీ మాల్ టర్నింగ్ వద్ద, ఉషా గ్రాండ్–పవన్ మెస్ జంక్షన్, ఎస్‌బీఐ ఈ–కార్నర్ జంక్షన్, తాలూకా ఆఫీస్ సెంటర్, జెడ్పీ పాఠశాల వద్ద జంక్షన్, నందిబొమ్మ సెంటర్‌లలో, ఎన్‌టీఆర్ బొమ్మ జంక్షన్, ఫోర్ట్‌గేట్ సెంటర్, టూ టౌన్‌లోని పోలీస్ ఐలాండ్ సెంటర్, బ్రహ్మానంద రెడ్డి మార్కెట్ జంక్షన్‌లు, విద్యుత్ సౌత్ సబ్‌స్టేషన్ బైపాస్ రోడ్డు జంక్షన్ తదితర ప్రాంతాలలో జంక్షన్లు, సెంటర్‌లు ఉన్నాయి. వీటి వద్ద వాహనదారులు రోడ్డు నియమాలు పాటించకపోవడంతో, ఎక్కడ పడితే అక్కడ వాహనాలు నిలిపివేయడం వల్ల అనేక సమస్యలు వస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాడేపల్లిగూడెంలో పట్టణంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పార్కింగ్ సమస్యలు పరిష్కరించాలి



ప్రధాన రహదారి కేఎన్ రోడ్డుపై ద్విచక్ర వాహనాలు కానీ, కార్లు, ఆటోలు ఎక్కువ సేపు నిలపకుండా చూడాలి. ప్రధాన రహదారి మార్గంలో వ్యాపార సంస్థలు, బ్యాంక్‌లు, ఇతర షాపింగ్ కాంప్లెక్స్‌లు, షాపులు ఉన్నందున అక్కడకు వెళ్లే వాహనదారులకు ప్రత్యేకంగాను, ఇతరులకు ఎటువంటి ఇబ్బందులు పడకుండా పలు ప్రాంతాలలో పార్కింగ్ ప్లేస్‌లు ఏర్పాటు చేయాలి. కేఎన్ రోడ్డు రహదారిలో రద్దీని తప్పక తగించాలి. ఆ దిశగా సంబంధిత ప్రభుత్వ అధికారులు చర్యలు చేపట్టాలి.

– కొరెడ్ల రామకృష్ణ, సీపీఎం నాయకుడు

క్లుప్తంగా

జంతు హింసను నివారించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ వాకాణి ప్రసాద్

తణుకు అర్బన్ : జంతు హింసను నివారించి పశువులపై ప్రేమతో వాటి కనీస అవసరాలు తీర్చాలని రాష్ట్ర పశు ఆరోగ్య సంస్థ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వాకాణి ప్రసాద్ అన్నారు. తణుకులోని పశు వైద్యశాల ఆవరణలో ఆదివారం పశు పెంపకందారులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భారత జంతు సంక్షేమ బోర్డు ఆదేశానుసారం వసంత పంచమి రోజును జీవ జంతు కల్యాణ దినోత్సవంగా నిర్వహిస్తున్నామన్నారు. మూగ జీవుల పట్ల ప్రతి ఒక్కరూ దయతో వ్యవహరించాలని, జంతు సంరక్షణ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని కోరారు. మూగజీవులను సంరక్షించి వాటి పోషణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ శ్రీధర్, డాక్టర్ శ్రీనివాస్, పశు పెంపకదారులు పాల్గొన్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.2 లక్షల విరాళం



దాత సుబ్బారావుకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ ఏఈఓ నటరాజారావు

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఇద్దరు భక్తులు వేరువేరుగా ఆదివారం రూ. 2,00,005 విరాళంగా అందజేశారు. అందులో భాగంగా గణపవరంనకు చెందిన ఎస్వీ సుబ్బారావు రూ.లక్ష, తాళ్లముదునూరు పాడుకు చెందిన సత్తి శ్రీనివాసరెడ్డి రూ.1,00,005 ఆలయ కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ ఏఈఓ పి.నటరాజారావు విరాళం బాండ్ పత్రాలను అందించారు.


లక్ష్మీగణపతికి ప్రత్యేక పూజలు



లక్ష్మీగణపతి స్వామి

తాడేపల్లిగూడెం (టీటీసీ): మాఘమాసం సందర్భంగా స్థానిక శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరీ ఆలయంలో లక్ష్మీ గణపతి స్వామి వారికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. పంచామృతాలు, ఫలరసాలు, సుగంధ ద్రవ్యాలు, వివిధ రకాల పానీయాలతో అభిషేకాలు చేశారు. ఆర్యవైశ్య సంఘం కార్యదర్శి నున్న బాల త్రిపుర సుందరరావు, పూర్వాధ్యక్షులు పేరూరి కాశయ్య, ఆలయ కార్యదర్శి ఆలపాటి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

గ్లోబల్ సపోర్ట్ ఆర్గనైజేషన్ సేవలు అభినందనీయం



విద్యార్థులకు సైకిళ్లను అందిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీటీసీ): గ్లోబల్ సపోర్ట్ ఆర్గనైజేషన్ ఫౌండర్ చెన్నాత్రికళ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు ఆదివారం దాతల సహకారంతో ఇద్దరు విద్యార్థులకు సైకిళ్లను అందజేశారు. ఇంటర్మీడియట్ చదువుతున్న ఉదయ్ శ్రీనివాస్, అదే విధంగా 5వ తరగతికి చెందిన విద్యార్థి హర్షకు అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ట్రస్టీ జనార్ధనరావు, ఉమా, మాజీ కౌన్సిలర్ కర్రి ప్రభాకర్ బాలాజీ, టీచర్లు ఆనందరావు, ప్రకాష్, దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్లకు అనుకూలమైన బడ్జెట్



మామిడి దాన వర ప్రసాద్

తాడేపల్లిగూడెం (టీటీసీ): ప్రధాని నరేంద్ర మోదీ కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ ఎప్పటి మాదిరిగానే కార్పొరేట్ శక్తులకు అనుకూలమైనదని, ప్రధానంగా రైతు, కార్మిక, కూలి, గ్రామిక వర్గాలకు వ్యతిరేకమైందని ఐఎఫ్‌టీయూ ఉమ్మడి జిల్లా సహాయ కార్యదర్శి మామిడి దాన వర ప్రసాద్ విమర్శించారు. ఆదివారం దాన వర ప్రసాద్ విలేకరులతో మాట్లాడుతూ దేశంలో ఉపాధి అవకాశాలు లేవని, నిరుద్యోగ సమస్య పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. భవన నిర్మాణ కార్మిక రంగం ఇబ్బందులలో ఉందని, ప్రజా సమస్యలపై స్పందన లేదని, ఆంధ్రప్రదేశ్‌కు మొండిచేయి చూపిందని, గత హామీల ఊసేలేదని విమర్శించారు.

బెల్టు షాపులపై దాడి

తాడేపల్లిగూడెం: స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఆదివారం పోలీసులు చేసిన దాడుల్లో ఒకరిని అరెస్టు చేశారు. గణపవరంలో బెల్టు దుకాణం నిర్వహిస్తూ, మద్యం విక్రయిస్తున్న ఒకరి వద్ద నుంచి 18 డ్యూటీ పెయిడ్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సీఐ ఇ.స్వరాజ్యలక్ష్మి, ఎస్సైలు మురళీమోహన్, దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ పట్టణ కమిటీ ఎన్నిక



పట్టణ ఎస్ఎఫ్ఐ నూతన కమిటీ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీటీసీ): ఎస్ఎఫ్ఐ పట్టణ నూతన కమిటీ ఎన్నిక ఆదివారం నిర్వహించారు. జిల్లా కమిటీ సభ్యులు ఎస్.లక్ష్మణరావు వివరాలను వెల్లడించారు. పట్టణ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా పి.నాగేంద్ర, టి.రవిబాబు, పట్టణ ఉపాధ్యక్షులు మణికంఠ, గణేష్, కార్యదర్శులు కేశవ, పవన్, గణేష్, సభ్యులుగా సత్యదిలీప్, గౌతం, భాను ప్రకాశ్, ధనుష్, సుభాకర్‌తో సహా 13 మంది సభ్యులతో నూతన కమిటీ ఎంపిక చేశారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యారంగ సమస్యలపై నిరంతర పోరాటాలు చేస్తామన్నారు. విద్యా దీవెన, వసతి దీవెన, ఇతర బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు



విద్యార్థినికి మెమెంటో అందజేస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

తణుకు అర్బన్: విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాన్ని ప్రోత్సహించేందుకు యూత్ యాక్టివిటీస్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఆనందం మస్తాన్‌రావు (బాబి) అన్నారు. తణుకు రోటరీ క్లబ్‌లో యూత్ యాక్టివిటీస్‌లో భాగంగా ఆదివారం అమర్ ఆర్ట్స్ అకాడమీ సౌజన్యంతో పర్యావరణ పరిరక్షణ అనే అంశంపై రెండు నుంచి పదో తరగతి విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. పోటీలకు పలు పాఠశాలల నుంచి హాజరైన 200 మంది విద్యార్థుల్లో విజేతలకు మెమెంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి కఠారి సిద్ధార్థ, అకాడమీ అధ్యక్షుడు అమర్, సభ్యులు గమిని రాంబాబు, పోతుల శ్రీనివాస్, అక్కిన కాశీ, వంగూరి హనుమంతరావు, ఆకెళ్ల సుబ్రహ్మణ్యం, బోడపాటి ప్రసాద్, విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం



లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రక్త పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీటీసీ): లయన్స్‌క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం సేవలు అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. క్లబ్ ఆధ్వర్యంలో జనతా ట్రస్ట్ నిర్వహణలో అధ్యక్షులు వీవీఎస్ లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో జి.హరిబాబు ఆర్థిక సహకారంతో ఆదివారం స్థానిక కడకట్ల జనతా ట్రస్ట్ కార్యాలయంలో ఉచిత సుగర్ వ్యాధి రక్త పరీక్షల శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 94 మంది రోగులకు పరీక్షలు చేశారు. సుగర్ వ్యాధి గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సన్నిధి సూర్యనారాయణ మూర్తి, చిన్నం జగదీష్, భీమవరపు మహాలక్ష్మి, బాపయ్య శర్మ, డాక్టర్ ఎల్ఎస్‌వీ నాగేశ్వరరావు, వి.రామ్మోహన్, సీహెచ్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తాత్కాలికంగా గుర్రపు డెక్క తొలగింపు



వెంకయ్యవయ్యేరు పంట కాల్వలోని గుర్రపుడెక్కను కిందకు నెట్టివేస్తున్న దృశ్యం

ఆకివీడు: పంట కాల్వలో తూడు, గుర్రపుడెక్క తొలగింపుకు ఏటా ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుంటే సంబంధిత కాంట్రాక్టర్లు వాటిని కాల్వలోనే నెట్టివేసి చేతులు దులుపుకుంటున్నారని రైతులు వాపోతున్నారు. స్థానిక వెంకయ్య వయ్యేరు పంట కాల్వలో గుర్రపుడెక్క, తూడు తొలగింపు పనులు ఆదివారం చేపట్టారు. కాలువ ఎగువ భాగంలో పేరుకుపోయిన గుర్రపుడెక్కను గట్లపైకి లాగివేయకుండా నీటిలోనే నెట్టివేయడం ద్వారా దిగువ ప్రాంతాల రైతులకు ఇబ్బంది కరంగా తయారైంది. వంతెనలు, లాకుల వద్ద గుర్రపుడెక్క తిష్ట వేసి నీటి ప్రవాహానికి ఆటంకం కల్గిస్తుందని పలువురు రైతులు వాపోతున్నారు. తూడు, గుర్రపు డెక్క కాలువ నుంచి బయటకు తీసేందుకు కాంట్రాక్ట్ పొందినప్పటికీ నీటి పారుదలలోనే నెట్టివేయడం వలన కాంట్రాక్టర్‌కు సొమ్ము ఆదా అవుతుందని పలువురు పేర్కొంటున్నారు. ఎగువ నుంచి వచ్చే గుర్రపుడెక్క మీడియం, మైనర్ పంట కాల్వల్లోకి ప్రవేశించి, మళ్లీ విపరీతంగా పెరిగిపోతుందంటున్నారు. దీనిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

అమ్మవారికి సారె సమర్పణ

ఉండి: మండలంలోని వెలివర్రులో ఉన్న వీరపేరంటాలమ్మకు ఈలంపూడికి చెందిన ముదుండి శ్రీనివాసరాజు దంపతులు 108 రకాల పిండివంటలతో ఆదివారం సారె సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని ప్రత్యేక పుష్పాలతో అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సారె సమర్పించి, అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని పూజలు చేశారు.

పేద విద్యార్థులపై కూటమి కక్ష

- 5న వైఎస్సార్‌సీపీ ఫీజు పోరు
- మాజీ మంత్రి కారుమూరి



తణుకులో ఫీజు పోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి కారుమూరి

తణుకు అర్బన్ : కూటమి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకుండా పేద విద్యార్థులపై కక్ష సాధిస్తోందని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు విమర్శించారు. తణుకు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం వైఎస్సార్‌సీపీ ఫీజుపోరు పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కారుమూరి మాట్లాడుతూ మూడు త్రైమాసికాలుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడంతో పేద పిల్లలను కళాశాలల యాజమాన్యాలు ఫీజులు కట్టాలంటూ ఒత్తిడి చేస్తున్నాయని విమర్శించారు. కళాశాల విద్య పూర్తయిన విద్యార్థులకు ఫీజులు చెల్లిస్తే గాని సర్టిఫికెట్లు ఇవ్వని దుస్థితి నెలకొందని, దీంతో తల్లిదండ్రులు అప్పులు చేయాల్సి వస్తోందన్నారు. ఆయా సమస్యలపై పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపుమేరకు ఈనెల 5న భీమవరం కలెక్టరేట్ వద్ద వైఎస్సార్‌సీపీ ఫీజుపోరు కార్యక్రమం నిర్వహించనున్నట్టు చెప్పారు. విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్న చంద్రబాబుకు తగిన మూల్యం చెల్లించక తప్పదని స్పష్టం చేశారు. పేదలకు ఉన్నత విద్య లక్ష్యంగా దివంగత వైఎస్సార్ ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రవేశపెట్టారని, మాజీ సీఎం జగన్ పథకాన్ని మరింత మెరుగ్గా అమలు చేశారని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం పేద పిల్లలకు ఉన్నత విద్యను దూరం చేస్తుందని ధ్వజమెత్తారు. వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ సభ్యుడు వెలగల సాయిబాబారెడ్డి, పార్టీ జిల్లా సెక్రటరీ ఆర్గనైజేషన్ యిండుగపల్లి బలరామకృష్ణ, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు మెహర్ అన్సారీ, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, తణుకు మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు జంగం ఆనంద్‌కుమార్, నాయకులు వి.సీతారాం, యడ్లపల్లి సురేంద్ర, ఎస్వీ జాకబ్ బాబు, రేలంగి రాంబాబు, షేక్ జిలానీ, వై.రామకృష్ణ, కొమ్మోజు రామకృష్ణ, గారపాటి సత్యనారాయణ పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో బల్లల పూజ

భీమవరం (ప్రకాశంచౌక్): పేరంటాల చెరువు గట్టు వద్ద శ్రీఆదిలక్ష్మి రజక సంఘం ఆధ్వర్యంలో గత 120 సంవత్సరాలుగా సాంప్రదాయ బద్ధంగా బల్లల పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు కొత్తపల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మా పూర్వీకులు 120 సంవత్సరాల క్రితం రజక సంఘ పెద్దలు ఈ బల్లల పండుగ ప్రారంభించారని, ఆ పండుగ సంక్రాంతి, భోగి పండుగ నుంచి బల్లల పూజ రోజు వరకూ రజక వృత్తిదారులు సెలవు పాటించి, బల్లలకు పూజలు చేసి, గంగమ్మ తల్లికి ధూపదీప నైవేద్యాలు, హారతులు ఇచ్చి, పసుపు కుంకుమ చలివిడి పానకాలు సమర్పిస్తారన్నారు. సంక్రాంతి తర్వాత వచ్చే ఆదివారం గాని గురువారం గాని ఈ పండుగ నిర్వహిస్తున్నామని తెలిపారు.

విద్యార్థికి చదువే మూలాధారం

భీమవరం: ప్రతి విద్యార్థికి చదువే మూలాధారమని, ప్రతి ఒక్కరూ చదువుకోవాలని జనసేన పట్టణ కార్యదర్శి సుంకర రవి అన్నారు. భీమవరం రెడ్డి కాలనీలోని శ్రీసిద్ధి గణపతి ఆలయంలో పంచమిని పురస్కరించుకొని 210 మంది చిన్నారులచే సరస్వతి పూజ చేయించి, పెన్నులు, పుస్తకాలను పంపిణీ చేశారు. రవి మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలోనూ ఎంతో ప్రతిభ దాగి ఉంటుందని, అనుకున్న లక్ష్యాలను సాధించేలా పట్టుదల క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలన్నారు. అనంతరం అర్చకులు చిన్నారులచే సరస్వతి పూజ నిర్వహించారు.

వైభవంగా అమ్మవార్ల జాతర





గ్రామ దేవతలను దర్శించుకుంటున్న మాజీ మంత్రి కారుమూరి, ఆరవల్లిలో కొలువైన గ్రామ దేవతలు

అత్తిలి: ఆరవల్లి గ్రామ దేవతలు శ్రీకనకదుర్గమ్మ, మావుళ్లమ్మ, మహంకాళమ్మ, మారమ్మ, చెవుళ్లమ్మ అమ్మవార్ల జాతర మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఆసాదుల గరగ నృత్యాలు, డప్పు వాయిద్యాలు, పలు సాంస్కృతిక ప్రదర్శన నడుమ అమ్మవార్ల జాతర మహోత్సవం నిర్వహించారు. మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అమ్మవార్ల జాతర మహోత్సవానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ వెలగల అమ్మిరెడ్డి మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావును ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన అన్నసమారాధన కార్యక్రమంలో కారుమూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


చిత్తడి నేలలతో నీటి శుద్ధి




చిత్తడి నేలల దినోత్సవంలో మాట్లాడుతున్న వక్తలు

భీమవరం: స్పేస్ సంస్థ ఆధ్వర్యంలో భీమవరంలో చిత్తడి నేలల దినోత్సవంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ప్రొఫెసర్ పీఆర్‌కే రాజ మాట్లాడుతూ మన డెల్టా ప్రాంతానికి చిత్తడి నేలలు ఒక వరమని అనేక సంవత్సరాలుగా ఇక్కడ ఉన్న చిత్తడి నేలలు నీటిని శుద్ధి చేసి, భూగర్భ జలాలను పెంచడంతో పాటు వ్యవసాయానికి ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. కె.కమలాకర్ శర్మ మాట్లాడుతూ చిత్తడి నేలలు కార్బన్ ప్రాసెసింగ్‌లో ముఖ్యమైన భూమిక పోషిస్తాయని తెలిపారు. తమ్మినీడి నాగేశ్వరరావు మాట్లాడుతూ చిత్తడి నేలలను పరిరక్షించవలసిన బాధ్యత రైతుల మీద కూడా ఉందన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి ద్రోహం



సీపీఎం ఆధ్వర్యంలో నిరసన చేస్తున్న దృశ్యం



బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

తాడేపల్లిగూడెం (టీటీసీ): కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు మరోసారి ద్రోహం చేశారని సీపీఎం పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా కేంద్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో ర్యాలీ, నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ 8వ సారి ప్రవేశపెట్టిన బడ్జెట్ సామాన్యులకు కోతలు, సంపన్నులకు వరాలు కురిపించారని ఎద్దేవా చేశారు. పేద, మధ్య తరగతి ప్రజలను దోచి కార్పొరేట్ శక్తులకు పంచి పెట్టే విధంగా ఉందని విమర్శించారు. విభజన చట్టప్రకారం వచ్చిన ఏ జాతీయ విద్యా సంస్థలకు కేటాయింపులు చేయలేదని, విశాఖ రైల్వేజోన్, స్టీల్ ప్లాంట్, కడప స్టీల్ ప్లాంట్, వైజాగ్ మెట్రో, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఊసే లేదని, వ్యవసాయ రంగానికి, ఆక్వా రంగానికి నిధులు కేటాయించ లేదని ఏపీ రాష్ట్రానికి మొండి చేయి చూపారని విమర్శించారు. బడ్జెట్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖమంత్రి పవన్ కల్యాణ్‌లు హర్షం వ్యక్తం చేయడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో జవ్వాది శ్రీను, గొన్నాబత్తుల నాగేశ్వరరావు, మడకా రాజు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు అనుకూలంగా బడ్జెట్

తణుకు అర్బన్ : కేంద్రం ప్రకటించిన బడ్జెట్ కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా ఉందే తప్ప దీని వలన పేదలకు ఒరిగిందేమీ లేదని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కామన మునిస్వామి అన్నారు. తణుకు సీపీఎం కార్యాలయం వద్ద ఆదివారం బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా మునిస్వామి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎనిమిదో బడ్జెట్ పేద ప్రజలకు వ్యతిరేకమైన బడ్జెట్ అని, కొద్దిమంది సంపన్నులకు అనుగుణంగా రూపొందించిన బడ్జెట్‌గా ఉందని విమర్శించారు. పేదలు, రైతులు, యువకులు, మహిళలకు ఎటువంటి ప్రాధాన్యత లేదని, బీమా రంగంలో 75% ఉన్న ఎఫ్డీఐలను 100 శాతానికి పెంచి బీమా రంగాన్ని కుదేలు చేశారని అన్నారు. ప్రభు త్వ రంగ సంస్థల్లోని రూ.47 వేల కోట్లను ప్రైవేట్ కార్పొరేట్ వ్యక్తులకు దారాదత్తం చేశారని మునుస్వామి ధ్వజమెత్తారు. రాష్ట్రంలో విశాఖ జోన్, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ, కడప స్టీల్ ప్లాంట్, విశాఖపట్నం మెట్రో, పోలవరం నిర్వాసితులకు నిధులు, గిరిజన యూనివర్సిటీకి నిధులు కేటాయించడంలో ఎటువంటి ప్రకటన చేయలేదని స్పష్టం చేశారు. ముఖ్యంగా రాష్ట్రానికి ఎటువంటి నిధులు కేటాయించకపోవడం విచారకరమని, ఈ బడ్జెట్ కేవలం ఢిల్లీ, బీహార్ ఎన్నికల కోసం మాత్రమే రూపొందించినట్లు ఉందని విమర్శించారు. పి.దక్షిణామూర్తి, గార రంగారావు, సత్యనారాయణ, నాసరి రత్నం పాల్గొన్నారు.